క్లుప్తంగా

నేడు ప్రజా దర్బార్

లక్కిరెడ్డిపల్లె : మండలంలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల నాయకులు యనమల మదన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఈడిగపల్లెలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈగా ప్రసాద్

రామాపురం : అన్నమయ్య జిల్లా రాయచోటి హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఓగా కేఎస్‌ఎం ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల హౌసింగ్ అధికారిగా పనిచేస్తూ అధికారుల ఆదేశాల మేరకు రాయచోటి హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈగా బాధ్యతలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

భూ సమస్యలపై పోరాటం

రైల్వేకోడూరు అర్బన్ : దళిత, గిరిజన, పేదల భూ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని బుధవారం బీకేఎంయూ జిల్లా కార్యదర్శి తోపు కిష్టప్ప తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తయినా ఇప్పటికీ దళిత, గిరిజనుల సమస్యలపై చొరవ చూపలేదన్నారు. కోడూరు నియోజకవర్గంలోని గ్రామాలలో దళితులు, గిరిజనులు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, అధికారులు వాటి పై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సమస్యలపై రాజీ లేని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పండుగోలు మణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లేబాక విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ముగ్గురు లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21న కడప పట్టణంలోని మున్సిపల్ స్టేడియంలో అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ ఎంపికలో అండర్-17 విభాగంలో జగదీష్ శుభంకర్, అండర్-14 విభాగంలో శివ చైతన్య, శశికిరణ్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మురళీకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న మురళీకుమార్‌ను, ఆయన సతీమణిని గ్రామస్తులతోపాటు తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈయన ప్రస్తుతం దుద్యాల పంచాయతీ పెద్ద జంగంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారు. సన్మాన కార్యక్రమంలో ఎంఈఓలు రమాదేవి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..



రాధాకృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : వత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత సూరినేని రాధాకృష్ణయ్యను బుధవారం ప్రధానోపాధ్యాయులు భాస్కర్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారులు చక్రధర్ రాజు, నాగా తిరుమల రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

రైతులను ఆదుకోవాలి

సంబేపల్లె : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో మోటకట్ల, దేవపట్ల, ముదినేనివాండ్లపల్లె, శెట్టిపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి ఎండిన వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం రైతులకు జరిగిన నష్టంపై ఆరాతీశారు. ప్రతి రైతుకు హెక్టారుకు రూ. 50 వేలు నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

'ఆపదమిత్ర' కరపత్రాలు విడుదల

సంబేపల్లె : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను ఆపదమిత్ర కార్యక్రమం ద్వార తెలియజేస్తామని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్కౌట్స్‌కు శిక్షణ ఇస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు శ్రేయస్కరం

- ముమ్మరంగా పొలం పిలుస్తుంది
- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు చేసిన అధికారులు

ఒంటిమిట్ట (సిద్ధవటం) : సుస్థిర వ్యవసాయ కేంద్రం (సీఎస్‌ఏ)సెర్టీస్ ఆధ్వర్యంలో ఏకశిల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కేంద్రంగా బుధవారం ఒంటిమిట్టలోని రైతులకు పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బరాయుడు, సుస్థిర వ్యవసాయ కేంద్రం కో–ఆర్డినేటర్ శంకరయ్యలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు చాలా అవసరమని ఈ పండ్ల మొక్కలను రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసుకోవడం వలన నిరంతరం ఆదాయాన్ని పొందడంతో పాటు, భూమిని సారవంతం చేసిన వారవుతారని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులను తగ్గించడమే లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం అనుసరించిన రైతుల ఉత్పత్తులకు సర్టిఫికెట్ ఇవ్వడమే కాక మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏ దేశామైనా సుభిక్షంగా ఉండాలంటే చెట్లు ఎక్కువ పెంచాలని, దీని ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించు



ఒంటిమిట్ట: పండ్ల మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్న అధికారులు

కోవడమే కాకుండా రైతులు మంచి ఆదాయాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్‌లు, రైతులు, రైతు సాధికార సంస్థ సిబ్బంది, సీఈఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంట పరిశీలన

సిద్ధవటం : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం సిద్ధవటం మండలంలోని బాపనపల్లె, మోదీన్‌సాబ్‌పల్లె గ్రామాల్లో బద్వేల్ ఏడీఏ నాగరాజు, మండల వ్యవసాయధికారి రమేష్‌రెడ్డి, ఉద్యాన అధికారి భరత్‌రెడ్డిలు పసుపు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపులో పోషకాల లోపం, బొబ్బడల తెగుళ్లను గుర్తించారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులతో చర్చించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సుధాకర్ బుధవారం తెలిపారు. మండలంలోని వీపీఆర్ కండ్రిక పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు స్థానికంగా పండిస్తున్న పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

సబ్సిడీ ఎరువులను పొందండి

ఓబులవారిపల్లె : రైతు సేవా కేంద్రం ద్వారా అందజేసే సబ్సిడీ ఎరువులను రైతులు పొందాలని ఏఓ బి.మల్లిక రైతులకు తెలియజేశారు. బుధవారం వై.కోట, బాలిరెడ్డిపల్లి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై ఉద్యానశాఖ పరంగా యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బొప్పాయి, అరటి, పసుపు పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భాస్కర్, పశువైద్యాధికారి దుర్గా, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచ్ అడపాల బాలాజీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ మల్లిక



సిద్ధవటం: మోదీన్‌సాబ్‌పల్లెలో పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు



రైల్వేకోడూరు అర్బన్: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

సిద్ధవటం : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చునని ఐసీడీఎస్ అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి తెలిపారు. సిద్ధవటం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టిక మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా ఐసీడీఎస్ అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి హాజరై పౌష్టికాహారంపై గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ పిల్లలకు రైమింగ్, పెయింటింగ్, డ్యాన్స్, ఫ్యాషన్ పోటీలను నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

సుండుపల్లె : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో డీఆర్‌పీఎస్ అల్లావలీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఎస్ వెంకటరమణ, వీఓలు, వెలుగు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

రాయచోటి టౌన్ : గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకే స్కూల్ గేమ్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ క్రీడల కో–ఆర్డినేటర్ అంబటి జగదీశ్వరయ్య చెప్పారు. స్కూల్ గేమ్స్ క్రీడల నిర్వహణలో భాగంగా బుధవారం మాసాపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో నియోజకవర్గ స్థాయి క్రీడలు నిర్వహించారు. ఇందులో ఆరు మండలాల నుంచి వచ్చిన 300 క్రీడాకారులు యోగా, చెస్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి వారు జిల్లా స్థాయికి ఎంపికవుతారన్నారు. న్యాయనిర్ణేతలుగా పీఈటీ మాస్టర్లు వాణి, అంజిలు వ్యవహరించారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

రాయచోటి (జగదాంబసెంటర్) : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకష్ మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ×థాలి బజావో× నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అల్లాబకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యిందని తెలియజేశారు. అమలు కానీ హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక హామీలిచ్చాం చూస్తుంటే భయం వేస్తోంది అని చెప్పడం ప్రజలను మోసగించడమే అని అభివర్ణించారు. సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్, మదనపల్లి పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, డీసీసీ మహిళా అధ్యక్షురాలు గోసాల దేవి, డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్ తదితరులు ప్రసంగించారు. నిరసనలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అటవీ అధికారుల కూంబింగ్

సిద్ధవటం : గొల్లపల్లె ఫారెస్టు సెక్షన్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో అటవీ అధికారులు బుధవారం కూంబింగ్ నిర్వహించారు. రేంజర్ కళావతి తన సిబ్బందితో కలసి కూంబింగ్ జరిపారు. అటవీ సంపద తరలి పోకుండా అనువణువునా గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కూంబింగ్‌లో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, రోళ్లబోడు ఎఫ్‌బీఓ, బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన

చిట్వేలి : కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో మెడల్స్ సాధించిన ఎన్‌సీసీ ట్రూప్ క్యాడెట్లను ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌లు బుధవారం అభినందించారు. ఈనెల 15 నుంచి 24 వరకు కడపలో జరిగిన శిక్షణ శిబిరంలో ఫైరింగ్‌లో సాయి కిరణ్, డ్రిల్‌లో రమ్యలు ఉత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్స్, కీర్తి, నవ్య ఆటల పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం



గర్భిణులకు సామూహిక సీమంతం చేయిస్తున్న ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు

పెనగలూరు : నియోజకవర్గంలో మెరుగైన పాలన అందిస్తామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి సేవ చేస్తానని తెలిపారు. సోమశిల బ్యాక్ వాటర్‌ను పెనగలూరు మండలానికి తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ గాలేరు – నగిరి నీరు నియోజకవర్గానికి అందించడమే కాకుండా మండలానికి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ ఇంద్రాణి, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

మండల కేంద్రమైన పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ అధికారులు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి పాల్గొని గర్భిణులకు రూ. 70 వేలను వితరణగా అందించారు. దీంతో 14 మంది గర్భిణులకు రూ. 5 వేలు చొప్పున నగదు అందించారు. దీనిపై సీడీపీఓ రాజేశ్వరీ, అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తాం



నందలూరు: దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

నందలూరు : దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు బుధవారం నందలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ప్రత్యేక నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా డిజేబుల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అలిమ్‌కో సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ సూపరిటెండెంట్ శివరామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ట్రై సైకిల్, వీల్ చైర్, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్, చంక కర్రలు, రోలేటర్స్, కృత్రిమ అవయవాలు లాంటి ఉపకరణాలు ఉచితంగా అందజేస్తామన్నారు. శిబిరంలో 60 మందికి పైగా దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, అధికారి రమేష్, అలిమ్‌కో సంస్థ అధికారులు ఆసీఫ్ కుమార్, శివం, ఆడియాలజిస్ట్ నవీన్ కుమార్, సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రకాల విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి పరికరాలు ఇవ్వడానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ శిబిరాన్ని జిల్లా కో–ఆర్డినేటర్ జనార్దన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అలిమ్‌కో సంస్థ అధికారి అనీల్, ఐఆర్‌డీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని శ్రీ ఆరెమ్మ తల్లి దేవాలయ సన్నిధిలో శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రప్పరెడ్డి ఆరంరెడ్డి ఏర్పాటు చేయించారు. శిబిరంలో వైద్యులు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 95 మందికి ఆపరేషన్‌లకు రెఫర్ చేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

పుల్లంపేట : ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గుడారు సీతమ్మ మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ సుబ్బారాయుడు అన్నారు. బుధవారం టి.కమ్మపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ బాగా చదివి విద్యతోనే కుటుంబ ఆర్థిక స్థితి గతులను మెరుగుపరుచుకోవాలన్నారు.

తిరువెంగళనాథ ఆలయ నిర్మాణానికి సహకారం

రామాపురం : గువ్వలచెరువు సూర్యకుమారుల కనుక మీద వేయించేసిన శ్రీ తిరువెంగళనాథ స్వామి(వేంకటేశ్వరస్వామి) ఆలయం శిథిలావస్థలో ఉందని, ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టాలని గువ్వలచెరువు గ్రామస్తులు మంగళవారం జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోమని చెప్పడంతో, బుధవారం జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించి, ఆలయం చరిత్ర, శాసనాల గురించి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం రిజర్వ్ ఫారెస్టులో ఉందని అటవీశాఖ అధికారుల అనుమతులు తీసుకొని ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని అధికారి తెలియజేశారు. ఆయనతోపాటు దుర్గాప్రసాద్, నాగార్జున, హరిప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు, వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చెకుముఖి' శాస్త్రీయ జ్ఞానం

వీరబల్లె : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సత్యకుమార్ తెలిపారు. బుధవారం వారు పాఠశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నా పత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలిన సమాజంలోని సంఘటలను, మూఢ నమ్మకాలను విద్యార్థులు సాధారణ పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నియమాలు పాటించడంలో ఆదర్శంగా నిలవండి

రాయచోటి టౌన్ : విద్యార్థులు అంటే రేపటి భావి భారత పౌరులు.. అలాంటి యువత ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హర్షలత ఫంకజ్ తెలిపారు. బుధవారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు, ఇతరా విద్యార్థులందరికీ ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాలనే కాదు సాధారణ ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అలాగే ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లు, జీపులు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమనేది అందరూ తెలుసుకోవాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 అధికారి గుర్రప్ప, ఎన్‌ఎస్‌ఎస్–2 అధికారి యు.ప్రసాద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జీఓ 117ను ప్రభుత్వం రద్దు చేయాలి

గాలివీడు : ప్రాథమిక విద్యా వ్యవస్థ కనుమరుగయ్యేలా గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. బుధవారం గాలివీడు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఓ 117ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీ ఇచ్చిందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలానే రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్ భారం లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలన్నారు. బదిలీలు, ప్రమోషన్‌లలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా జరపాలన్నారు. మెరుగైన పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సివి రమణ, శ్రీరాములు నాయక్, బచ్చల శ్రీనివాసులు, జనార్దన్ రాజు, వెంకటయ్య, రమణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన సమాజమే ఫార్మసిస్టు లక్ష్యం



ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవ వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు

రాజంపేట : ఆరోగ్యమైన సమాజమే ఫార్మసిస్టు లక్ష్యమని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.స్వర్ణలత అన్నారు. బుధవారం ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి ఫార్మసిస్టు సేవలు ఎంతో ప్రధానమన్నారు. ఎన్నో ఫార్మా కంపెనీలు వారు చేసిన పరిశోధనల వలన నూతన మందులను కనుగొనడం జరుగుతోందన్నారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డా.పి.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ఫార్మసిస్టు సేవలు రోగి జబ్బు నియంత్రణకు సరైన మోతాదు, సరైన ఔషధం అందించడంలో కీలకమన్నారు. తద్వారా ఆరోగ్య సమాజం ఏర్పాటుకు ఫార్మసిస్టు దోహదపడతారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ చిన్నకృష్ణయ్య తదితర ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్‌కు ఘన నివాళి



రాజంపేట టౌన్: దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ నేతల నివాళి



రాయచోటి టౌన్: నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : భరతమాత సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం రమేష్ నాయుడు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : దేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అట్టడుగున ఉన్న పేదవాడికి చేరాలని చెప్పిన నాయకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ అని రాయచోటి బీజేపీ సీనియర్ నాయకుడు అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. రాయచోటిలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



లక్కిరెడ్డిపల్లెలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో బీజేపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులకు దీన్‌దయాళ్ గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ షఫీ నాయక్, జై చంద్ర నాయుడు, విజయమోహన్, మద్దుల రామచంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.